ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 25 ఫిబ్రవరి , 2026 | పేజీలు : 06

వివరాలు మెయిన్‌లో

వైభవంగా ఎదుర్కోళ్లోత్సవం

యాదాద్రిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

జగన్మోహినిగా దర్శనమిచ్చిన నరసింహుడు

ప్రజాపక్షం/ యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు మంగళవారం స్వామివారు భక్తులకు జగన్మోహిని అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో నిత్యారాధనలు పూర్తి చేసిన అనంతరం, స్వామివారిని జగన్మోహిని రూపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి తిరువీధులలో ఊరేగించారు.

రాక్షసులను మైమరపించిన రూపం..

శ్రీసాగర మధన వేళ ఉద్భవించిన అమృతాన్ని రాక్షసుల బారి నుండి రక్షించి దేవతలకు అందించేందుకు మహావిష్ణువు ధరించిన అపూర్వ రూపమే ఈ జగన్మోహిని అవతారం. స్వామివారి ఈ సౌందర్యరాశిని చూసి పక్కనే ఉన్న శ్రీదేవి, భూదేవిలు సైతం అసూయ పడ్డారని పోతన భాగవతం పేర్కొంటోంది. తన తళుకు బెళుకుల నడకలతో, కంటి సౌందర్యంతో లోకాన్ని పరవశింపజేసే ఈ దివ్యాకృతిని భక్తులు దర్శించుకుని తన్మయత్వం చెందారు.

అధికారిక బృందం పర్యవేక్షణ..

ఈ వేడుకలను శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేద పండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు.

జె. భవానీశంకర్,కార్యనిర్వహణాధికారి ఎమ్. హనుమంతరావు, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

బి. నరసింహామూర్తి (ఆలయ అనువంశిక ధర్మకర్త) ఇతర అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

రాత్రికి అశ్వవాహన సేవ..

వైభవంగా 'ఎదుర్కోలు' మహోత్సవం..

బ్రహ్మోత్సవాలలో మరో ప్రధాన ఘట్టమైన ఎదుర్కోలు వేడుక నేటి రాత్రి జరగనుంది. నిత్యారాధనల అనంతరం స్వామివారు అశ్వవాహనంపై అధిష్ఠించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.జీవుల చంచల స్వభావానికి ప్రతీక అయిన అశ్వాన్ని తనే నియంత్రించగలనని తెలుపుతూ, భక్తకోటిని రక్షించేందుకు స్వామివారు ఈ వాహనంపై విచ్చేస్తారు. స్వామివారిని (వరుడు) నీలమేఘ శ్యాముడిగా ఉపనిషత్తులు, స్తోత్రాలు కీర్తిస్తుండగా.. అమ్మవారి పక్షాన ఆచార్య పురుషులు ఆమె గుణగణాలను కొనియాడతారు. పరమపదంలో ఉండే పరమాత్మ, జీవకోటి రక్షణార్థం నేల మీదకు దిగిరావడమే ఈ వేడుకలోని ప్రధాన అంతరార్థం. ఈ అపూర్వ సన్నివేశాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు.

14వేల ఎకరాల ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకుంటున్నాం

లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్

ప్రజాపక్షం/చింతలపాలెం : మండల కేంద్రంలో గల దొండపాడు గ్రామం నందు రూ.394 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను మంగళవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలపై, పనులు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సెప్టెంబర్ నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. తాను మొదటిసారిగా ఎమ్మెల్యేగా అయినప్పుడు ఈ ప్రాంతానికి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేదన్నారు.

రహదారులు, లిఫ్ట్ ఇరిగేషన్ పనులను మా హయాంలోనే జరిగినట్లు గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 14వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శివగంగా లిఫ్ట్ వద్ద కాపర్ వైర్ చోరీ జరిగినట్లు రైతులు మంత్రి దృష్టికి తేగా వెంటనే స్పందించి వారిపై నిందితులను పట్టుకోవాలని డిఎస్‌పిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఈ రమేష్ బాబు, డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, ఈఈ కిషోర్, ఏఈ శ్రీనివాస్, తహశీల్దార్ సూరయ్య, ఎస్ఐ సందీప్ రెడ్డి, నాయకులు నరాల కొండారెడ్డి, చిలకల శ్రీనివాసరెడ్డి, నందిరెడ్డి ఇంద్రారెడ్డి, దేవిరెడ్డి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంజారా ఆరాధ్యదైవం సేవాలాల్

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ప్రజాపక్షం/నాంపల్లి: నీతి,నిజాయితీ,ధర్మం వంటి సత్యమార్గాలు బోధించిన సంత్ సేవాలాల్ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకుని సమాజం ముందుకెళ్లాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. బంజారా సమాజ ఆరాధ్యదైవం,ఆధ్యాత్మిక గురువు శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు మునుగోడు నియోజకవర్గ స్థాయిలో మంగళవారం స్థానిక శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. చండూర్ ఆర్‌డిఓ శ్రీదేవి పర్యవేక్షణలో నాంపల్లి తహసీల్దార్ గూగులోతు దేవాసింగ్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో డాక్టర్ కల్కి భగవాన్,నాంపల్లి గ్రామ సర్పంచ్ నక్క చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తీవ్రంగా ఖండిస్తున్నాం

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మేర మల్లన్న జాతరలో 2 నెలల పసికందు మృతికి నిరసనగా కారకులైన జాతి, కుల అహంకారులు శ్రీనివాస్ రెడ్డి, సతీష్ రెడ్డి, మాధవ రెడ్డి, కన్ని రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, తుకారం రెడ్డి (సర్పంచ్) వంటి దుండగులను శిక్షించాలని పట్టణ కేంద్రం చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేశారు. జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ నినాదాలు చేశారు. మండల రజక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు న్యూ డెమోక్రసి నాయకులు వివిధ సంఘాల నాయకులు మద్దతుగా నిలిచారు.

నాగు పాము కలకలం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని హౌసింగ్ బోర్డు 17వ వార్డులో నివాసం ఉంటున్న పానుగోతు సైదానాయక్ ఇంట్లో ప్రమాదకరమైన నాగుపాము కనిపించింది. విషయం తెలుసుకున్న వార్డు మాజీ కౌన్సిలర్ లావూరి రవినాయక్ వెంటనే స్థానిక కౌన్సిలర్ నూకల కవిత వేణుగోపాల్‌రెడ్డికి సమాచారం అందించారు. వార్డు ప్రజల భద్రత దృష్ట్యా కౌన్సిలర్ వెంటనే స్పందించి స్నేక్ క్యాచర్‌ను పిలిపించి పామును సురక్షితంగా పట్టించారు. సకాలంలో స్పందించి ప్రమాదాన్ని తప్పించిన కౌన్సిలర్‌కి, రవినాయక్‌కు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

యూనివర్సిటీ పోటీలకు ముఖేష్ ఎంపిక

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; ఢిల్లీలో జరగనున్న ఆల్ ఇండియా యూనివర్సిటీ బాక్సింగ్ పోటీలకు మండల పరిధిలోని కొల్‌ముంతల్‌పహాడ్ గ్రామానికి చెందిన ముదిగొండ ముకేష్ ఎంపికైనట్లు తెలిపారు. సోమవారం మిర్యాలగూడలో జరిగిన ఇంటర్ యూనివర్సిటి బాక్సింగ్ పోటీలలో గెలుపొంది తాను ఈ పోటీలకు ఎంపికయ్యానని అన్నారు. ముకేష్ ప్రస్తుతం నల్గొండలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రి కళాశాలలో డిగ్రి చదువుతున్నాడు. ప్రభుత్వం, దాతలు సహకరించినట్లయితే తాను ఆల్ ఇండియా పోటీలలో కూడా మంచి ప్రతిభ కనబరుస్తానని అన్నారు. గతంలో మండల మాజీ ఎంపిపిదూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డిల ఆర్థిక ప్రోత్సాహంతో తాను ఈ బాక్సింగ్ పోటీలలో ప్రతిభ కనబరుస్తున్నానని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

జిల్లా ఎస్‌పి కె నరసింహ

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల రక్షణలో భాగంగా సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు చేయనున్నట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ మంగళవారం ఒక ప్రకనటలో తెలిపారు. జిల్లాలో 25.02.2026 నుండి 18.03.2026 వరకు పరీక్షలు జరుగుతుండగా పరీక్షల సమయంలో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేదాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమ్మికూడరాదన్నారు. నిషేధిత వస్తువులతో పరీక్ష కేంద్రాల వద్ద తిరగడం నిషేధమని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల నుండి 200 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు తేది.25.02.2026 నుండి 18.03.2026 వరకు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులు పరీక్ష సమయంకన్నా అర గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని, కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రతాపరంగా ప్రత్యేక ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. సెంటర్ల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటించాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటించాలని జిల్లా ఎస్‌పి నరసింహ తెలిపారు. త్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ చేయడం నిషేధమని, మైనర్ వాహనం నడిపి పట్టుబడిన సందర్భాల్లో వాహన యజమానిపై కూడా కేసు నమోదు చేయబడుతుందని హెచ్చరించారు. వాహన యజమానులు మైనర్ వ్యక్తులకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్ వాహనం నడిపినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ ప్రమాదాలు వాహన యజమానితోపాటు ఇతర వ్యక్తులకు కూడా నష్టం కలిగించే అవకాశముందని, కాబట్టి మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాల ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలు పోలీసులతో భాగస్వామ్యమైన రోడ్డు నియమాలు పాటించాలన్నారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలి, ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రజా భద్రత దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా నిరంతర తనిఖీలు చేపడతామని స్పష్టం చేశారు.

పూజలు, మంత్రాల పేరుతో ఘరానా మోసం- అమాయక ప్రజలే టార్గెట్

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పూజలు, మంత్రాలు యంత్రాలు పేరుతో ఘరానా మోసం చేస్తూ ప్రజల నుంచి బంగారం, డబ్బులను అక్రమంగా తీసుకుంటున్న నిందితున్ని మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 30 గ్రాముల బంగారపు చైన్, మొబైల్ స్వాదీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశాలతో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. మిర్యాలగూడ టూటౌన్ సీఐ సోమనర్సయ్య, ఎస్ఐ బి.రాంబాబు మీడియాకు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జివల్లా ఆత్మకూర్ మండలం గట్టికల్ గ్రామం ఆయుర్వేదిక్ డాక్టర్ కోని వినోద్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడు సులభంగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశ్యంతో జల్సాలకు అలవాటు పడిన వినోద్ నాటు వైద్యం, మంత్రాల పేరుతో అమాయకుల ప్రజలను టార్గెట్ చేసి భయభ్రాంతులకు గురి చేసి అనారోగ్యం తగ్గిస్తాను అని నమ్మించి నగదును, బంగారాన్ని మాయమాటలు చెప్పి మోసం చేసి ముడుపుల రూపంలో తీసుకుంటున్నాడు. అందులో భాగంగా పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన అడావత్ శిరీష, ఆమె భర్త గోవింద్‌లు కలిసి వారి ఇద్దరి మగ పిల్లలన నూతన్‌కల్‌లో ఉన్న వినోద్ వద్దకు అప్పుడప్పుడు తీసుకోని వెళ్లి వినోద్ వద్ద పిల్లలకు కాళ్ల కడియాలు ఇప్పించేవారు. నిందితుడు వారి నమ్మకాన్ని అదునుగా తీసుకోని వారికి ఏదైనా మాయమాటలు చెప్పి వారిని మోసం చేయాలని నిర్ణయించుకోని గత కొన్ని రోజుల క్రితం వినోద్ మిర్యాలగూడలోని రాఘవేంద్ర కాలనీలో గల సదరు శిరీష కిరాయి ఇంటికి వెళ్లి, శిరీష భర్త గోవింద్ వైపు చూసి నీకు ప్రాణహాణి ఉందని, ఆయుష్య పెంచాలంటే పూజ చేయాలని, దేవతకు ముడుపు కట్టాలని చెప్పి భయపెట్టి సుమారు 5.7తులాల బంగారం, 13,200 నగదును ఫోన్‌పే ద్వారా తీసుకున్నాడు. ముడుపు పేరిట బంగారాన్ని గుడ్డలో కట్టి 41రోజుల వరకు విప్పవద్దని చెప్పి వారు కళ్లు మూసుకోని ప్రార్థన చేస్తున్న సమయంలో బంగారాన్ని తీసుకున్నాడు. ఇట్టి విషయమై మిర్యాలగూడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అవగా ఇట్టి కేసులో నిందితుడిని పట్టుకోని రిమాండ్‌కు తరలించారు. కేసులో విచారణ జరిపి నేరంలో భాగస్వాములైన ఇతర నేరస్తులను కూడా త్వరలో అదుపులోకి తీసుకుంటామన్నారు. అదేవిధంగా నిందితుడు మేళ్ల చెరువు గ్రామంలో పెళ్లి పేరు చెప్పి ఐదు తులాల బంగారం తీసుకోని గోల్డ్ లోన్ పొందాడని, నకిరేకల్ మండలంలోని చందుపట్ల గ్రామంలో ఒక కుటుంబాన్ని బెదిరించి బంగారం తీసుకోని లోన్ పొందాడని, సూర్యాపేట పట్టణంలో కూడా ఇలాంటి పద్ధతిలో బంగారం మోసం చేసినట్లు ఒప్పుకున్నాడని, నూతన్‌కల్ మండలం పెద్దనమలి గ్రామంలో ఒకరిని వారం రోజుల్లో చనిపోతావని భయపెట్టి బంగారం, వెండి, నగదు తీసుకున్నాడని అన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాపక్షం/మోతె : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మహిళ శక్తి భవనం గ్రామ సర్పంచ్ అనురాధతో కలిసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం కోటి మంది మహిళలను కోటేశ్వరులను చేయడం లక్ష్యంగా ప్రతి గ్రామానికి రూ.10 లక్షలతో మహిళా సంఘాల భవనం నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు. ఉపసర్పంచ్ ఉపేందర్ రెడ్డి, నాయకులు వీరన్న, గణేష్, యశోద తరుణ్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : పట్టణంలోని శ్రీవేదాంత భజన మందిరంలో జరుగుతున్న 24వ వార్షికోత్సవ పూజల సందర్భంగా మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మురిశెట్టి నివేదిత లక్షాది దంపతులతోపాటు 39వ వార్డు కౌన్సిలర్ దంతాల సాయిప్రియ సందీప్ దంపతులు, 23వ వార్డు కౌన్సిలర్ వల్దాస్ లక్ష్మి లు శ్రీసీతా రామచంద్ర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత 74 సంవత్సరాలుగా వినాయక చవితి పూజలు, శ్రీరాముని వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ధరూరి సింగరాచార్యులు, మందిర అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రాజశేఖర్, కోశాధికారి సోమ అశోక్, వీరవెల్లి రామమూర్తి, సోమ సుమన్, నాయకులు పాల్గొన్నారు.

దాతల మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నం చెయ్యొద్దు

ప్రజాపక్షం/రామన్నపేట : దాతల సహకారంతో నిర్మించిన కళావేదిక తొలగింపు వారి మనోభావాలను దెబ్బ తీసే ప్రయత్నం జరుగుతుందని నిర్నేముల హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. గ్రామంలో హమమాన్ యూత్ అసోసియేషన్ గత 12 ఏళ్లుగా ఈ సంస్థ వివిధ సామాజిక మరియు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందనీ, గ్రామంలోని పాత పాఠశాల ప్రాంగణంలో మేము గ్రామస్తుల సహకారంతో గ్రామంలో ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక చైతన్యం కోసం, ముఖ్యంగా దేవి నవరాత్రుల వంటి పండుగల నిర్వహణకు పరిమాణంలో ఒక వేదికను నిర్మించినట్లు, ఇది ఏ ఒక్క వ్యక్తి స్వంతం కాదు, గ్రామస్తులందరి ఉమ్మడి ఆస్తి అని, ఈ వేదిక నిర్మాణం కోసం గ్రామస్తులు, భక్తులు , దాతలు తమ కష్టార్జితాన్ని వెచ్చించారాన్నారు. ప్రభుత్వ ధనంపై భారం పడకుండా, సామాజిక బాధ్యతతో దీనిని నిర్మించడం జరిగిందన్నారు. అన్ని కోణాల ఆలోచన చేసి రాజకీయ ఉద్దేశ్యాలు పక్కన పెట్టి సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో తిరిగి సర్వే చేయించి, పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో భవన నిర్మాణాన్ని చేపట్టాలని యూత్ అసోసియేషన్ సభ్యులు మునుకుంట్ల మల్లేష్, ఏభూషి రమేష్, దోమలపల్లి గోపి, పల్లె రవీందర్ రెడ్డి, ఆవుల లక్ష్మి నారాయణ, సుర్వి నవీన్, దాసరి శ్రవణ్ తదితరులు కోరారు.

డ్రైవర్ నిర్లక్ష్యంతో యువకుడు మృతి

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి : కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన షేక్ చాంద్ పాషా (30) మృతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన షేక్ చాంద్ పాషా రంజాన్ ఉపవాసాల నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో గుమ్మడవెల్లి బస్‌స్టాప్ ఎదురుగా ఉన్న దిమ్మెలపై కూర్చొని పండ్లు తోముకుంటుండగా కొండమల్లేపల్లి నుండి నల్గొండకు వెళుతున్న ఎర్టిగా కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంతో దిమ్మెపై కూర్చున్న చాంద్ పాషాను బలంగా ఢీకొట్టడంతో ఎగిరి రోడ్డుపై పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన చాంద్ పాషాను కుటుంబ సభ్యులు 108లో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుండి నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, 4 సంవత్సరాల కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

గ్రామ పాలనపై అవగాహన

ప్రజాపక్షం/మోతె : మండల కేంద్రంలోని శ్రీశక్తి భవన్‌లో మంగళవారం రెండవ విడత వార్డు సభ్యులకు శిక్షణ రెండవ రోజు నిర్వహించడం జరిగిందని ఎంపిడిఓ ఆంజనేయులు అన్నారు. ప్రతి వార్డు సభ్యులు గ్రామ పాలనపై చట్టాలపై కనీసం అవగాహన కలిగి ఉండాలని కోరారు. గ్రామ సమస్యలకు వెంటనే పరిష్కార మార్గాలు చూడాలని, గ్రామాలలో పారిశుద్ధ్యం కాపాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు వెంకన్న, వినోద్‌రెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

ప్రజాపక్షం/మోతె : మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం ఇంటర్ విద్యార్థినీలకు సుమారు 16 మందికి పరీక్ష ప్యాడ్లను మండల కేంద్రానికి చెందిన వార్డు సభ్యులు తమ స్వంత ఖర్చులతో ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. వార్డు సభ్యులు నవీన్, తరుణ్, రాము పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాపక్షం/గరిడేపల్లి: మండల పరిధిలోని పోనుగోడు గ్రామానికి చెందిన మిట్టపల్లి రాంబాబు ఆకాల మృతి తీవ్ర భయానకమని తన తోటి చిన్న నాటి స్నేహితులు తీవ్ర మనోవేదనను వ్యక్తం చేశారు. జన్మనిచ్చిన వృద్ధ తల్లిదండ్రులకు, ఎదిగిన తన ఇద్దరు పిల్లలకు బాసగా నిలవాల్సిన సమయంలో ఏమి తెలియని తన భార్యపై బాధ్యతలు పెట్టి తిరిగిరాని లోకాలకు వెళ్లిన రాంబాబు కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటామని వారి స్నేహితులు 50వేల రూపాయలు ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. అనంతరం రాంబాబు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుందరి వీరభాస్కర్, ఎడిఈ తాటికొండ కిరణ్, బొలిశెట్టి రమేష్, గోపగాని శ్రీధర్, జల్లా శ్రీనివాస్, ఆర్టీసీ కండక్టర్ భాగ్యరావు పాల్గొన్నారు.

హెల్మెంట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా వాడాలి

ప్రజాపక్షం/మోటకొండూర్ : వాహనాలలో ప్రయాణించేటప్పుడు హెల్మెంట్, సీటు బెల్ట్ తప్పనిసరిగా వాడాలని, లేకుంటే ప్రమాదాలు జరినప్పుడు ప్రాణాలు పోయే ప్రమాదం ఉంటుందని మోట కొండూర్ ఎస్ఐ డి.అశోక్ అన్నారు. ఆయన మోటకొండూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ముందు పలువురు వాహన దారులకు హేల్మేంట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యత గురించి వివరించారు. హెల్మెంట్ లేకుండా ప్రయాణం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమండ్ల శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, బుగ్గ కొంరయ్య పాల్గొన్నారు.

కుమ్మెర మల్లన్న జాతరలో రజకులపై దాడి సిగ్గుచేటు

ప్రజాపక్షం/మునగాల: దేవాలయ దర్శనానికి వెళ్లిన రజక కులానికి చెందిన కుటుంబంపై రెడ్డి కులానికి చెందిన అగ్రవర్ణాల దాడి చేసి రెండు నెలల పసిపాప మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని మునగాల గ్రామ రజక సంఘం కమిటి వారు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని రజక కాలనీలో, మునగాల రజక సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లాలో కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతరలో రజక కుటుంబంపై జరిగిన దాడి సంఘటనను తీవ్రంగా ఖండిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించి, చిన్నారి మృతికి శాంతి చేకూరాలని కోవ్వోత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఇంతటి ఘోరమైన సంఘటనకు కారణమైన రెడ్డి కులస్తులను తక్షణమే అరెస్టు చేసి జైలుకు పంపాలని, స్థానిక ఎస్ఐ, సిఐ ని ఉద్యోగం నుండి పూర్తిస్థాయిలో తొలగించాలని, బిడ్డను కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్న పాప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు సిహెచ్ సీతరాం, బిఆర్ఎస్ నాయకులు ఉడుం కృష్ణ, సిపిఎం గ్రామ కార్యదర్శి గడ్డం వినోద్, టిడిపి నాయకులు వేట ఆశోక్, జనసేన గ్రామ నాయకులు పసుపులేటి సందీప్, ఎఐఎస్ఎఫ్ నాయకులు శివ, రజక సంఘం నాయకులు తంగెళ్ల పాపారావు పాల్గొన్నారు.

ఉద్యోగాలు తొలగిస్తే ఆత్మహత్య చేసుకుంటాం

ఎయిమ్స్ ఆసుపత్రి సెక్యూరిటీ ఉద్యోగుల హెచ్చరిక

ప్రజాపక్షం/బీబీనగర్ : యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)లో సెక్యూరిటీ ఉద్యోగులుగా పని చేస్తున్న తమను తొలగిస్తే ఆత్మహత్య చేసుకోవడానికి వెనుకాడమని పది మంది సెక్యూరిటీ ఉద్యోగులు హెచ్చరించారు. గత కొంత కాలంగా ఎయిమ్స్‌లో పని చేస్తున్న తమను తొలగించామని, వెళ్లిపోవాలని చెప్పడంతో మంగళవారం ఆసుపత్రి ముందు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. గత రెండు సంవత్సరాల క్రితం తాము ఎయిమ్స్‌లో ఉద్యోగాలు కావాలని దరఖాస్తు చేసుకున్నామని, ఇటీవల సెక్యూరిటీ సిబ్బంది ఖాళీలు ఉన్నాయని తెలియడంతో పయనీరు సెక్యూరిటీ సంస్థ వారు ఫోన్ చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో ఉద్యోగంలో చేరామని తెలిపారు. విధుల నిర్వహణలో తమకు పయనీర్ సెక్యూరిటీ సూపర్వైజర్ సోమనాథ్ అజమాయిషీ ఉంటుందని కానీ హౌస్ కీపింగ్ చెందిన కొందరు తమ నియామకాలు చెల్లవని ఇక్కడ నుండి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని బాదితులు గుంటుపల్లి మమత, బిందు, కళ్యాణి, భాను ఆరోపించారు. హౌస్ కీపింగ్ సర్వీస్‌కు, సెక్యూరిటీ సర్వీసుకు వేరువేరుగా సూపర్వైజర్లు ఉన్నా, సంబంధం లేని వ్యక్తులు మాపై దుర్భాషలాడడం సమంజసం కాదన్నారు. తమకు ఎయిమ్స్ ఆసుపత్రిలో ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని గత రెండు సంవత్సరాల క్రితం బయోడేటా ఇచ్చామని, అవకాశం ఉండటంతో సోమనాథ్ ఇటీవల పదిమందిని నియమించారని తెలిపారు. మమ్మల్ని వెళ్లిపోవాలని అనడం వారికి హక్కులేదన్నారు.

కార్మికులను రోడ్డున పడేయొద్దు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఎఫ్‌సీఐలో పనిచేసే కార్మికులను రోడ్డున పడేయొద్దని వారి ఉపాధిని కాపాడాలని ఎఫ్‌సీఐ హమాలి వర్కర్స్ కోఆపరేటీవ్ సొసైటీ అధ్యక్షుడు బిచ్చనాయక్, లాలునాయక్, చిన్న రవి, దీప్లానాయక్, బిల్లు, విజయ్, చందర్‌లు కోరారు. మంగళవారం స్థానిక ఎఫ్‌సీఐ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఫ్‌సీఐలో 210 మంది నాన్ డీపీఎస్ కార్మికులు ఉన్నారని, ఎఫ్‌సీఐపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటూ జీవిస్తున్నారని తెలిపారు. చర్లపల్లి గోదాములో పనిచేసే 33 మంది స్వీపర్లు, టెక్నికల్ సిబ్బందిని మిర్యాలగూడకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు తెలుస్తుందని చెప్పారు. అక్కడ సిబ్బందిని ఇక్కడికి బదిలీ చేయడం వల్ల ఇక్కడ పని చేసే కార్మికులకు ఉపాది లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏండ్లుగా ఎఫ్‌సీఐను నమ్ముకోని జీవనం సాగిస్తున్న కార్మికుల పొట్ట కొట్ట వద్దని అన్నారు. ఇతర ప్రాంతాల్లో గోదాముల్లో కార్మికుల కొరత తీవ్రంగా ఉందని, ఆ ప్రాంతాలకు బదిలీ చేసుకోవచ్చని చెప్పారు. మిర్యాలగూడలో పనిచేసే కార్మికులను రోడ్డున పడేయకుండా బదిలీ ఉత్తర్వులను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. స్తానిక కార్మికుల ఉపాది విషయంపై ఎఫ్‌సీఐ జీఎం, డిఎం, ఈడీ ఆలోచన చేసి ఆ ఆర్డర్లను రద్దు చేసి స్తానికంగా పనిచేసే కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ కార్మికులు సత్రనాయక్, బాలాజీనాయక్, చిన్నబాల, కృష్ణ, మౌలా, బాబు, శంకర్‌రావు, భిక్షరెడ్డి, సైదా, కమిలి, నాగమణి, లలిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు సత్వర చర్యలు

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : దాతర్పల్లి గ్రామ పరిధిలో సాగునీరు అందక ఎండిపోతున్న పంట పొలాలను కాపాడేందుకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బిర్లా ఐలయ్య సత్వరమే స్పందించారు. గ్రామంలోని పాడిపంటలు నీరందక దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ విషయాన్ని స్థానిక నేతలు వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రైతుల ఇబ్బందులను ఫోన్ ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కాలువ ద్వారా సాగునీరు వెంటనే అందేలా అవసరమైన మరమ్మతులు, ఇతర పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని అధికారులను మరియు స్థానిక ప్రతినిధులను ఆదేశించారు. పేదల పెన్నిధిగా, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా పేరుపొందిన ఎమ్మెల్యే చొరవతో నీటి కష్టాలు తీరనున్నాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు దాతర్పల్లి గ్రామ సర్పంచ్ కాల్నే సరితభాస్కర్ కాలువ పనులను స్వయంగా ప్రారంభించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాట్ల పరిశీలన

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలోని టౌన్ హాల్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అదేశాల మేరకు హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ పరిధిలోని లైసన్స్ డ్రైవర్లకు నేడు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్‌బాబు తెలిపారు. మంగళవారం టౌన్ హాల్‌లో కంటి వైద్య శిబిరం ఏర్పాట్లను కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, సిఐ చరమందరాజు లు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని సిమెంట్ పరిశ్రమల ట్రాన్స్‌పోర్టు లారీ అసోసియేషన్, ఆటో డ్రైవర్లు, స్కూల్ బస్, క్యాబ్ డ్రైవర్లకు ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన సీనియర్ కంటి వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు నిర్వహించి అవసమైన వారికి మందులు, కళ్ల అద్దాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థిక సహాయం అందజేత

ప్రజాపక్షం/రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలోని భోగారం గ్రామానికి చెందిన కనుక సత్తయ్య ఆకస్మాత్తుగా మృతిచెందగా గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వీరితో పాటు గ్రామ ఉపసర్పంచ్ బైకాని ఉమా మహేష్, వార్డు మెంబర్లు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ప్రొఫెసర్

ప్రజాపక్షం/నలగొండ టౌన్ : నల్లగొండ పరిధిలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో,బయో కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫసర్ గా పనిచేస్తున్న పల్లా మురళీమోహన్ రాష్ట్ర స్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి హైదరాబాద్ లో వచ్చే నెల మార్చి 6, 2026న ప్రారంభం కానున్న 7వ జాతీయ స్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు.ఆయన తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు.కాగా ఇలా జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం మురళీమోహన్‌కి మూడవ సారి గతంలో ఒడిషా లోని భువనేశ్వర్, ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలలో జరిగిన పోటీలకు కూడా రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించారు.ఈసందర్భంగా మంగళవారం విశ్వ విద్యాలయ ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తఫ్ హుస్సేన్,రిజిస్ట్రార్ ఆచార్య అలువాల రవి,సహచర అధ్యాపకులు,విద్యార్థులు అభినందనలు తెలిపారు.

కృత్రిమ గర్భధారణతో పాల దిగుబడి పెంపు

ప్రజాపక్షం/నకిరేకల్ : పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ ద్వారా అధిక పాల దిగుబడిన ఇచ్చే మేలు జాతి దూడలను పొంది రైతులకు ఆర్థికంగా మేలు చేకూరుతుందని ఉమ్మడి జిల్లా ఈవో డాక్టర్ రాజశేఖర్ అన్నారు. పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని భాస్కర్లబాయి గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో 25 గేదేలకు, రెండు ఆవులకు పరీక్షలు నిర్వహించారు. 25 దూడలకు నట్టల నివారణ మందు,120 పశువులకు గాలి కుంటు టికాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్నా మౌనిక వెంకట్ రెడ్డి, మండల పశువైద్య అధికారి రవి, మాజీ సర్పంచ్ ఎన్న వెంకట్ రెడ్డి ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని అంబాల 33/11 కేవి సబ్ స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ మర్చడం జరుగుతున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు త్రి ఫేజ్ విద్యుత్ సరఫరా నిలివేయడం జరుగుతుందని విద్యుత్ ఏఈ నర్సింహాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంజియు డిగ్రీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు చివరి అవకాశం

ప్రజాపక్షం/నలగొండ టౌన్ :మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ 2019/20,2020/21బ్యాక్లాగ్ విద్యార్థులకు చివరి అవకాశం కల్పించనున్నట్లు సి ఓ ఈ డా ఉపేందర్ రెడ్డి తెలిపారు. పరీక్ష ఫీజు ఆలస్య రుసుము లేకుండా మార్చి 16వ తేదీ వరకు రూ.100 ఆలస్య రుసుముతో 17 మార్చి వరకు చెల్లించవచ్చని ఆయన తెలిపారు.పూర్తి వివరాలు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. సంబంధిత కళాశాలలను సంప్రదించాలని ఆయన సూచించారు.

బాలల హక్కులపై అవగాహన

ప్రజాపక్షం/నకిరేకల్ : మండలం లోని చందుపట్ల గ్రామంలో మంగళవారం బాలల పరిరక్షణ కమిటీ సమావేశంనిర్వహించారు. బాలల హక్కులు,బాల్య వివాహాలు,బాలల చట్టాలు హక్కులు రక్షణ చర్యల గురించి వివరించారు.కార్యక్రమంలో సర్పంచ్ దిగోజు లత వెంకటాచారి ఉప చర్పంచ్,వార్డ్ మెంబెర్, సభ్యులు సెక్టార్ సూపర్వైజర్ సునీత,బాలల పరిరక్షణ విభాగం రేవతి,అశ్విత ఎన్‌జిఓ ఝాన్సీ,అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ

ప్రజాపక్షం/నకిరేకల్ : మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 60 మంది పేద విద్యార్థిని విద్యార్థులకు నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ రేపాల వెంకన్న నిర్మల చిన్న కుమారుడు మణిదీప్,మేఘన దంపతుల మూడవ పెళ్లిరోజు స్టీల్ వాటర్ బాటిల్స్అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్,పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, వృద్ధాశ్రమం ట్రస్ట్ చైర్మన్ ఎన్ రామ్మోహన్రావు,క్లబ్ కార్యదర్శి సూర్య చందర్ రావు, కోశాధికారి అందెం వెంకన్న, ఉపాధ్యాయులు వంటల ఆనంద్ బాబు, సామంతపురి మురళి, విజయనిర్మల, పాఠశాల ఎస్ ఎంసి చైర్మన్ బిక్షమమ్మ పాల్గొన్నారు.

గండూరికి ఘనంగా సన్మానం

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సూర్యాపేట మున్సిపాలిటిలో స్వతంత్ర అభ్యర్థిగా 38వ వార్డు నుండి పోటిచేసి ఎన్నికల్లో విజయం సాధించిన కౌన్సిలర్ గండూరి రమేష్‌ను మంగళవారం పట్టణంలోని బొడ్రాయి బజార్‌లో కొలువైన శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఆలయ కమిటి సభ్యులు ఘనంగా సన్మానించారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. అలాగే వార్డులోని ప్రముఖులు తాటి శ్రవణ్, బింగి సంతోష్, సురేష్, తలిశెట్టి శ్రీనివాస్ ఆయనకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : నేటి ఆధునిక కాలంలో మొబైల్ ఫోన్ అనేది కేవలం సమాచార సాధనం మాత్రమే కాదని, అది ఒక వ్యక్తి యొక్క వ్యక్తిగత సమాచారం ఆర్థిక లావాదేవీలకు కీలకమైన వనరు అని అదనపు ఎస్‌పి జి.రమేష్ పేర్కొన్నారు.నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన సుమారు 60 మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం సిఈఐఆర్ పోర్టల్ ఐఎంఈఐ ట్రాకింగ్ సహాయంతో పోలీసులు విజయవంతంగా రికవరీ చేశారు. వన్ టౌన్ సిబ్బంది కె సత్యనారాయణ ఐటి కోర్ టీం సమన్వయంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ఈ ఫోన్లను ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారు.రికవరీ చేసిన ఫోన్లను మంగళవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో అదనపు ఎస్పీ జి. రమేష్ స్వయంగా పరిశీలించి, వాటి అసలు యజమానులకు అందజేశారు.తమ ఫోన్లను తిరిగి పొందిన బాధితులు పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి,వన్ టౌన్ సిఐ రాజ శేఖర్ రెడ్డి,ఎస్ ఐలు గోపాల్ రావు,వెంకట నారాయణ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫోటోగ్రాఫర్‌పై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ఫోటోగ్రాఫర్ మధుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ ఫోటోగ్రాఫర్ కు తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ వెన్నుదన్నుగా ఉంటుందని, నిందితులను కఠినంగా శిక్షించాలని పట్టణ ప్రధాన కార్యదర్శి దాసపత్రి జనార్దన్ డిమాండ్ చేశారు.తిరుమలగిరి మండలం అల్వాల్ ఎక్స్ రోడ్డులో గల ఓ ఫంక్షన్ హాల్ లో నూతన పట్టు వసలంకరణ ఫంక్షన్లో,ఫోటోగ్రాఫర్ మధు పై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం పట్టణంలోని గడియారం సెంటర్లో తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నల్లగొండ పట్టణ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి,ఫోటోగ్రాఫర్ మధుకు న్యాయం జరిపి,నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా పట్టణ ప్రధాన కార్యదర్శి దాసపత్రి జనార్దన్ మాట్లాడుతూ నిన్న ఫోటోగ్రాఫర్ పై దాడి జరగటం దురదృష్టకరమని ఈకార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సామల వెంకటేశ్వర్లు,పట్టణ అసోసియేషన్ కోశాధికారి పెరిక నాగరాజు,గౌరవ సలహాదారుడు సామనబోయిన రాము,కార్యనిర్వాహక కార్యదర్శి కలగోని ధనుంజయ గౌడ్,కార్యవర్గ సభ్యులు విజయ్ కుమార్, మేడి వినోద్ కుమార్ ఉన్నారు.

జర్నలిస్ట్ రఘు అరెస్ట్

ప్రజాపక్షం/నకిరేకల్ : ఖమ్మం జిల్లా వెలుగుమట్ల గ్రామంలో పేదల గుడిసెల కూల్చివేతను కవర్ చేయడానికి వెళ్తున్న జర్నలిస్ట్ రఘు,దాసరి శ్రీనివాస్‌తో మరి కొంతమందిని పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.కేతపల్లి మండలం కొర్లపాడు టోల్‌ప్లాజా వద్ద ఈ ఘటన జరిగింది.వెలుగుమట్లలో సుమారు 15 వేల మంది పోలీసుల బందోబస్తు మధ్య జేసీబీలతో వెయ్యికి పైగా గుడిసెలను కూల్చుతున్నారని సమాచారం.ఆప్రదేశానికి వెళ్లి పరిస్థితిని ప్రత్యక్షంగా రిపోర్ట్ చేయడానికి బయలుదేరిన రఘుతో పాటు మరికొందరిని పోలీసులు నిలిపివేశారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.మేము అడ్డుకోవడానికి కాదు,వార్త కవర్ చేయడానికి వెళ్తున్నాం.ప్రజల పక్షాన ప్రశ్నించడం మా బాధ్యత అని రఘు స్పష్టం చేశారు. పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు.ఘటన స్థలంలో నకిరేకల్ సీఐ హరిబాబు,శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి,నకిరేకల్, కేతపల్లి ఎస్ఐ లు వీరబాబు,సతీష్ తదితరులు బందోబస్తు నిర్వహించారు.అదుపులోకి తీసుకున్న వారిని అనంతరం విడుదల చేసినట్లు సమాచారం.

అప్పుల కుప్పగా మారిన గ్రామ పంచాయతీలు

ప్రజాపక్షం/రామన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీలకు కనీసం నిధులు కేటాయించకుండా కాలయాపన చేస్తే గ్రామాల అభివృద్ధి ఎలా సాధ్యమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ విమర్శించారు. వెల్లంకి గ్రామంలో రఘురామ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సిపిఎం మండల రాజకీయ శిక్షణ తరగతులు రెండవ రోజు సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జహంగీర్ మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల నుండి గ్రామపంచాయతీలకు పైసా విదల్చకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కొంటుబడి పోయిందని అన్నారు. ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి చేతులు దులుపుకుంటే ఎలా అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బల్గురి అంజయ్య పాల్గొన్నారు.

ఫ్యాడ్స్ పంపిణీ

ప్రజాపక్షం/తుంగతుర్తి : తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు తన మేనమామ ధర్మారపు ఉప్పలయ్య జ్ఞాపకార్థం మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్కేల్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకు అనుకూల వాతావరణం కల్పించాలని, విద్యార్థులకు తోడ్పాటు అందించాలని తన మేనమామ ఉప్పలయ్య కలలుగన్న ఆశయాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్వాల ప్రవీణ్ కుమార్, మందడి కవిత, కొండగడుపుల యాకయ్య, గుజ్జ భాస్కర్ పాల్గొన్నారు.

నకిరేకల్‌లో పోలీసుల వినూత్న డ్రైవ్

ప్రజాపక్షం/నకిరేకల్ : రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు నల్లగొండ జిల్లా పోలీసులు వినూత్న కార్యక్రమం చేపట్టారు.మంగళవారం నకిరేకల్ పట్టణంలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలపై వచ్చిన వారికి గులాబీ పూలు అందించి అభినందించారు.హెల్మెట్ లేకుండా వచ్చిన వారికి పూలు ఇచ్చి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్‌పి జి. రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు రోడ్డు భద్రతపై కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నెల 22 నుంచి వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో నల్లగోండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి,నకిరేకల్ టౌన్ సీఐ హరిబాబు,ఎస్ఐ వీరబాబు,కేతపల్లి ఎస్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ కవితకు ఘన సన్మానం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ఇటీవల నల్లగొండ కార్పొరేషన్ కు జరిగిన ఎన్నికలలో 48వ డివిజన్ నుండి భారీ మెజార్టీతో గెలుపొందిన యామా కవిత దయాకర్‌ను మంగళవారం పట్టణంలోని 48వ డివిజన్ కనకదుర్గ వీధికి చెందిన ప్రజలు స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో ఆత్మీయ సన్మాన సత్కారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కనకదుర్గ వీధి ప్రజలు యమ కవితా దయాకర్ దంపతులను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ కవితా రాణి మాట్లాడుతూ వార్డుకు సంబంధించిన ఏ సమస్య అయినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మి శెట్టి శ్రీనివాస్,కనకదుర్గ వీధి ముఖ్య నాయకులు, కలశం అశోక్ సకినాల వెంకన్న,ఆకవరం రాజు,నాయిని ప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత వీడియో క్లాస్‌లు

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : విద్యార్థులకు ఉచిత వీడియో క్లాస్‌లు అందించేందుకు మాజీ కౌన్సిలర్లు కొంగరి కృష్ణ, దారెడ్డి వేణు గోపాల్ రెడ్డి ఆర్థిక సహకారంతో ప్రత్యేక యాప్ రూపొందించి విద్యార్థులకు అందుబాటులో ఉంచినట్లు ముక్తాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పంతులు మధుబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిటిఎం సమావేశంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్ చేతుల మీదుగా యాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 1వ, 2వ వార్డు కౌన్సిలర్లు శ్రీరామ్ మంజుల లింగస్వామి యాదవ్, కొండ మడుగు యల్లస్వామి, చెన్నకేశవ స్వామి టెంపుల్ చైర్మన్ కుక్కలి జగన్, టీచర్‌లు పద్మ, సంగీత లక్ష్మి కరుణ మేరీ, రేణుకలు విద్యార్థులు పాల్గొన్నారు.

రెండవ రోజు శిక్షణ తరగతులు

ప్రజాపక్షం/చింతలపాలెం : మండల కేంద్రంలోని ఎంఆర్‌సి నందు నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు ఐదు రోజుల శిక్షణ తరగతులలో భాగంగా మంగళవారం 2వ రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఓటిలు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామచంద్రారావు, మండల పంచాయితీ అధికారి భూపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి ఆడబిడ్డ పెళ్లికి పొన్నగంటి కల్యాణం

ప్రజాపక్షం/డిండి: తవకలాపూర్ గ్రామ ప్రజలకు ఆ గ్రామ సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య తన ప్రమాణ స్వీకారం సందర్భంగా గ్రామ ప్రజలకు పొన్నగంటి కళ్యాణ లక్ష్మీ కానుక ప్రకటించారు. గ్రామంలో కుల మత తారతమ్యం లేకుండా పార్టీలకతీతంగా ఆడ బిడ్డ పెళ్లికి పొన్నగంటి కళ్యాణ లక్ష్మీ కానుకగా రూ. 5వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో చన మోని రాములు, వెంకటయ్య, వెంకట్‌రాములు, శ్రీను, వెంకటేష్, ప్రశాంత్, మల్లేష్, అలేందర్ పాల్గొన్నారు.

బిజెపిలో చేరిక...

ప్రజాపక్షం/డిండి; భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి, డిండి గ్రామ వాస్తవ్యులు పున్న దినేష్ మంగళవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ సమక్షంలో బిజెపిలో చేరారు. ఈసందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ దేశం కోసం ధర్మం కోసం పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బిజెపిలో చేరి సమాజ సేవకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డా. మనోహర్‌రెడ్డి, బిజెపి నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెంకటేష్ గౌడ్‌కు సన్మానం

ప్రజాపక్షం/నాంపల్లి: మండలంలోని పెద్దాపురం గ్రామ సర్పంచ్ పల్లె వెంకటేష్ గౌడ్‌ను తెలంగాణ స్టేట్ టాక్స్ ఫోర్స్ అబ్కారీ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని అమరావతి హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ టాస్క్ ఫోర్స్ అబ్కారీ ఎస్పి నంద్యాల అంజిరెడ్డి,డిఎస్పి ఎంపీఆర్ చంద్రశేఖర్,సిఐ సాయికిరణ్ రెడ్డి, ఎస్ఐ భరత్ కుమార్‌లు శాలువా,పూలదండలతో ఆయనను ఘనంగా సత్కరించారు.

కొబ్బరికాయల విక్రయానికి 26న వేలం

ప్రజాపక్షం/నిడమనూరు: ఈనెల 7 నుండి 10 వరకు నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ఎర్రబెల్లి లింగమంతుల స్వామి జాతర నిర్వహణ సందర్భంగా కొబ్బరి కాయల విక్రయానికి ఈ నెల 26న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ మన్నెం వెంకన్న తెలిపారు.జాతర సందర్భంగా కొబ్బరి కాయలు విక్రయం, మిఠాయి,కొబ్బరి చిప్పలు సేకరణ,బొంగులు పుట్నాలు విక్రయాల కొరకు వేలం నిర్వహించనున్నారు.ఆసక్తి కలిగిన వారు ఈ నెల 26 న ఎర్రబెల్లి లింగమంతుల స్వామి గుట్ట వద్ద నిర్వహించే బహిరంగ వేలం పాల్గొన వలసిందిగా ఆయన కోరారు.

ఆడబిడ్డను కాపాడుకోవడం మనందరి బాధ్యత

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఆడపిల్లలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని సీడీపీవో మమత అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలను కాపాడుకోవడం అందరి బాధ్యత అని, ఆడపిల్లలు చదువుకోవడానికి ప్రభుత్వం ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందని ఆడపిల్లలకు ఎలాంటి ఆపద వచ్చినా అక్కున చేర్చుకోవడానికి బాలసదనాలు ఉన్నాయని, ఆడపిల్లలు వద్దు అనుకున్న వాళ్లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన ఉయ్యాలలో వేయాలని, అంతేగాని అక్రమ దత్తత ఇవ్వకూడదన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ బాలలకు భద్రత కల్పించాల్సి బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ మొయినొద్దిన్, ఎంఈవో ధర్మానాయక్, ఏపీఎం దిలీప్, నిజాముద్దిన్, కార్మిక అధికారి శేషారత్నం, జిల్లా బాలల పరిరక్షణ విభాగం రమణి, పోలీసులు ఉషా, అరుణ, సూపర్‌వైజర్లు రాధిక, వాణి, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రజాపక్షం/హాలియా: ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఇబ్రహీంపేట,పాలెం గ్రామాలలో పర్యటించి పండ్ల తోటలను పరిశీలించి వాటి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులతో చర్చించారు. హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గత ఐదు రోజులుగా ఇబ్రహీంపేట,పాలెం గ్రామాలలో వివిధ కార్యక్రమాలు చేపడుతూ ప్రజల కు సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.దీనిలో భాగంగానే మంగళవారం ఇబ్రహీంపేట శివారులో గల పండ్ల తోటలు పరిశీలించి వీటి సాగులో రైతులు చేపడుతున్న వివిధ యాజమాన్య పద్ధతులను క్షేత్రస్థాయిలో పర్యటించి అడిగి తెలుసుకున్నారు. దీంతోపాటు పాలెం గ్రామంలో కూడా ఇంటింటి సర్వే చేపట్టి ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరుతున్నాయా లేదా అనే అంశాలపై కూడా సర్వే నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతయ్య,డాక్టర్ మాధవి,రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన రథోత్సవం ఘనంగా ప్రారంభం

ప్రజాపక్షం/చండూరు (గట్టుప్పల) :మండలంలోని అంతంపేట గ్రామంలో నిర్వహిస్తున్న సోమేశ్వరాలయ జాతర ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని భక్తిశ్రద్ధలతోభక్తుల నడుమ వైభవంగా కొనసాగుతున్నాయి. ముడు రోజుల పాటు జరుగుతున్న జాతరలో మూడవ రోజు కార్యక్రమంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.తదనంతరం నూతన రథోత్సవాన్ని ఇందుర్తి వాస్తవ్యులు కుంభం సత్యనారాయణ రెడ్డి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి, గట్టుప్పల కాంగ్రెస్ మండల అధ్యక్షులు నామిని జగన్నాథం, ఎస్ఐ సంజీవరెడ్డి,శ్రీశైలం గౌడ్,రాచమల్ల వెంకటరెడ్డి,గుడి చైర్మన్ మాడుగుల నవీన్, పూసపాటి శంకరప్ప, ఓసి రెడ్డి రామిరెడ్డి, సిరప్ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళా భారతి కోసం వినతి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: పట్టణంలో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం కళాభారతి ఏర్పాటు చేయవలసిందిగా నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి కి కవులు కళాకారులు వినతి పత్రం సమర్పించారు.నల్లగొండ కార్పొరేషన్ కు నూతనంగా ఎన్నికైన మేయర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన కవులు కళాకారుల బృందం ఘనంగా సన్మానించింది.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కవులు కళాకారుల కోసం త్వరలోనే సాంస్కృతిక కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో కళాభారతి సాధన కమిటీ అధ్యక్షులు బక్క పిచ్చయ్య, ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ కవులు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి గజవెల్లి సత్యం,చిలువేరు లింగమూర్తి, బుచ్చిరెడ్డి,డాక్టర్ రావిరాల అంజయ్య,వలబోజు రామ బ్రహ్మచారి,యర్ర దేవదానం,డాక్టర్ సాగర్ల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/మునుగోడు : తిరుమలగిరి మండలంలో ఓశుభకార్యానికి ఫోటోలు తీసేందుకు వెళ్లిన ఫోటోగ్రాఫర్ పై మద్యం మత్తులో దాడి చేసి, కెమెరాలను ధ్వంసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మునుగోడు మండల ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మాధగోని సైదులు గౌడ్ డిమాండ్ చేశారు.మంగళవారం మండల కేంద్రంలోని చౌరస్తాలో ఫోటోగ్రాఫర్‌పై దాడికి నిరసనగా ఫోటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈనిరసన కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాటం వెంకన్న,ఉపాధ్యక్షుడు నిమ్మల నాగర్జున,కోశాధికారి నూకల లింగస్వామి,కుటుంబ భరోసా ఇంచార్జ్ సద్దల శ్రీశైలం,కమిటీ సభ్యులు తవిటి సురేష్, పున్న శంకర్,రావుల స్వామి,శిర్గమల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు, అక్రమ దత్తతలు చట్టరీత్యా నేరం

ప్రజాపక్షం/వేములపల్లి: మండలంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కన్వర్జెన్సీ సమావేశం సోమవారం నిర్వహించారు.ఈసమావేశంలో సీడీపీఓ చంద్రకళ మాట్లాడుతూ మండలంలో ఎక్కడా బాల్యవివాహాలు,అక్రమ దత్తతలు జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని,అలాంటి ఘటనలు వెలుగులోకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. పిల్లల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ హేమలత,ఎంపీఓ లలిత,ఏపీఓ శ్రీనివాస్ రెడ్డి,సిహెచ్ఓ ప్రవీణ్,ఐకేపీ సీసీ గోపీనాథ్, సూపర్వైజర్ రజనీ,అంగన్వాడీ టీచర్లు జయమ్మ, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాపక్షం/మర్రిగూడ: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల కళాశాలలో నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ వెంకటేష్,డివో మంగమ్మ తెలిపారు.పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.ప్రతి రోజు సుమారు 350 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు.విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.పరీక్షా కేంద్రంలో ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు, వాచీలు తదితర పరికరాలను అనుమతించబోమని స్పష్టం చేశారు.

108, 102 అంబులెన్సుల సర్వీస్‌పై డిఎంహెచ్ఓ సమీక్ష

ప్రజాపక్షం/యాదాద్రి : వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో యాదాద్రి జిల్లా డిఎంహెచ్వో మనోహర్ 108, 102 అమ్మఒడి వాహనాల సేవలపై సమీక్ష సమావేశంలో నిర్వహించారు. జిల్లాలో ప్రజలకు అందుతున్న ఎమర్జెన్సీ సేవలపై, 102 అమ్మఒడి వాహనాల గర్భిణీ స్త్రీలకు అందుతున్న సేవలు గురించి తెలుసుకున్నారు. 102 అమ్మఒడి వాహనాలు గర్భిణీ మహిళలకు అందుబాటులో ఉండి సేవలను అందించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ప్రతి ఒక్క గర్భిణీ 102 వాహన అమ్మబడి సేవలను వినియోగించుకోవాలని ప్రమాద సమయాలలో అత్యవసరానికి 108 అంబులెన్స్ సర్వీస్‌ల కొరకు వినియోగించుకోవాలని డిఎంహెచ్వో ప్రజలందరు సేవలను వినియోగించుకోవాలని తెలియజేశారు. యాదాద్రి జిల్లా 108, 102 కోఆర్డినేటర్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ సలీం పాల్గొన్నారు.

నిందితులను ఉరి తీయాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో దైవ దర్శనానికి వెళ్లిన బీసీ రజక కుటుంబాన్ని కుల వివక్షతో అతి కిరాతకంగా కొట్టి రెండు నెలల చిన్న పిల్లను కాలితో తొక్కి హతమార్చిన అగ్రవర్ణ రెడ్డి హంతకులను బహిరంగంగా ఉరి తీయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. మంగళవారం రాత్రి పట్టనంలో కొవ్వత్తులతో ర్యాలి నిర్వహించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, ఆప్రిత్, ఉదయ్, మహేష్, శేఖర్, ఉపేందర్, గంగాధర్, సిద్ధంరాజు, శేఖర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

లోక రక్షణార్థం.. నరసింహుని కల్యాణం!

నేడు వైభవోపేతంగా యాదగిరి లక్ష్మీ నరసింహస్వామి తిరుకల్యాణ మహోత్సవం

ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించనున్న సిఎం రేవంత్ రెడ్డి దంపతులు

విద్యుత్ కాంతుల్లో ధగధగలాడుతున్న యాదగిరి కొండ

భక్తుల రద్దీ దృష్ట్యా పటిష్ట బందోబస్తు.. సర్వం సిద్ధం

ప్రజాపక్షం/యాదాద్రి : యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పరమ పవిత్ర ఘట్టం ఆసన్నమైంది. భక్త కోటి వేచిచూస్తున్న లోక కళ్యాణకారిణి 'శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం' బుధవారం రాత్రి 09:30 గంటలకు గిరిపై అంగరంగ వైభవంగా జరగనుంది. వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించే ఈ వేడుకను కళ్లారా వీక్షించి తరించేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు.

రాష్ట్రం తరపున సీఎం దంపతుల సమర్పణ

ఈ మహోన్నత వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు విచ్చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం తరపున స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను వారు సమర్పించనున్నారు. సీఎం వెంట దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు హాజరుకానున్నారు. అతిథులకు జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఈవో జే.భవాని శంకర్ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

కన్నులపండువగా అలంకరణలు

కల్యాణం నేపథ్యంలో ప్రధానాలయం, మాడ వీధులు విద్యుత్ దీపాల వెలుగులో ధగధగలాడుతున్నాయి. సుగంధ పుష్పాలతో గిరి పరిసరాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లలో చలువ పందిళ్లు వేయడంతో పాటు, నిరంతర తాగునీరు, అన్నప్రసాద వితరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. అత్యవసర సేవల కోసం వైద్య బృందాలను సిద్ధం చేశారు.

నిఘా నీడలో యాదగిరి

భక్తుల రద్దీ మరియు ప్రముఖుల రాక దృష్ట్యా జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్ పర్యవేక్షణలో యాదగిరిగుట్ట ఏసిపి శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. వందల మంది పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. కొండపైకి వాహనాల నియంత్రణ, భారీ పార్కింగ్ ఏర్పాట్లు చేయడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి బందోబస్తు పరిరక్షిస్తారు.

పాప ప్రక్షాళన.. కల్యాణ దర్శనం: యాదగిరి క్షేత్రంలో స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. అర్ధరాత్రి నిర్ణీత శుభ ముహూర్తానికి అర్చక పండితుల సమక్షంలో లక్ష్మీ నరసింహుల కల్యాణ తంతు నిర్వహించనున్నారు.

వేగంగా ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ పనులు

రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్

ప్రజాపక్షం/నల్లగొండ : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి మరియు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్ ఎన్‌డీసీ , ఆర్ ఆర్, ల్యాండ్ అక్విజిషన్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అన్ని సాగునీటి ప్రాజెక్టుల పనులలో పురోగతి తీసుకురావాలన్నారు.విభాగాల వారీగా సమీక్షించిన ఆయన, భూసేకరణ, పునరావాసం,పరిహారం చెల్లింపులు తదితర అంశాలలో ఉన్న పెండింగ్ విషయాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,ఆర్డీవోలు, రెవిన్యూ ,ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జిల్లాలో నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ఆదేశించారు.మంగళవారం నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.విద్యార్థులకు ప్రభుత్వం 5 నిమిషాల సడలింపు ఇచ్చిందని, ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమన్నారు.జిల్లాలో మొత్తం 109 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, రెగ్యులర్ మరియు ప్రైవేట్ కలిపి 19,835 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల రోజున మధ్యాహ్నం 1 గంట వరకు జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి,ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు.

ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన హౌసింగ్ ఎండి గౌతమ్

ప్రజాపక్షం/చివ్వెంల : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను హౌసింగ్ ఎండి గౌతమ్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి మంగళవారం మండలంలోని గుంపుల గ్రామంలో ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడి వారికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

సంఘ బంధం భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/మర్రిగూడ :మండలంలోని కొండూరు గ్రామపంచాయతీ పరిధిలో సంఘ బంధం భవన నిర్మాణానికి మంగళవారం శుభారంభం జరిగింది. గ్రామ సర్పంచ్ ఆంబోతు సీతారామ నాయక్ ఆధ్వర్యంలో ఎంపీడీవో సి.జి. మున్నయ్య, ఏపిఎం వెంకటేశు కలిసి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాల యాదయ్య,ఏపిఎం వెంకటేష్,టిఏ నరసింహ,వార్డు సభ్యులు,అంకం నవీన్,గ్రామ పెద్దలు,మహిళా సంఘాల సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

ప్రజాపక్షం/నాంపల్లి: మండలంలోని ముష్టిపల్లి గ్రామంలో ఈ నెల 18న నాగర్ కర్నూల్ మండలంలోని కుమ్మెర గ్రామంలో జరిగిన మల్లికార్జున స్వామి జాతరలో గణేష్ కుటుంబ సభ్యులు దర్శనానికి వెళుతుండగా మహిళలను దుర్భాషలాడుతూ కులం పేరుతో దూషిస్తూ రెండు నెలల పసిపాపను కాలితో తన్ని పాప మరణానికి కారణమైన ఎనిమిది మంది దుండగులను వెంటనే శిక్షించాలని,పాప కుటుంబానికి అండగా ఉండాలని ముష్టిపల్లి రజక సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ముష్టిపల్లి వెంకటయ్య,మారేపల్లి నరసింహ, ముష్టిపల్లి ప్రకాష్,గండు నాగేంద్ర బాబు, నల్లగంటి శ్రీనివాస్,నల్లగంటి శ్రీకాంత్,కుందరపు శ్రీకాంత్, ముష్టిపల్లి శ్రీనయ్య,బుషిపాక యాదయ్య, ముష్టిపల్లి పరమేశ్,ఎరుకల వెంకటేష్ గణేష్,శేఖర్,నరసింహ పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్.. 40 గ్రాముల బంగారం స్వాధీనం

ప్రజాపక్షం/నకిరేకల్ (కేతేపల్లి): కేతేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సుమారు రూ.6.50 లక్షల విలువైన 40 గ్రాముల బంగారం తో పాటు యమహా ఎఫ్‌జెడ్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ అడిషనల్ ఎస్‌పి రమేశ్ మంగళవారం తెలిపారు. నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూఏలూరు జిల్లా చేబ్రోలు గ్రామానికి చెందిన తాడేపల్లి మధుబాబు బస్సు డ్రైవర్,ఈ నెల 24న కొర్లపహాడ్ టోల్‌ప్లాజా సమీపంలోని హోటల్ వద్ద బస్సు ఆగిన సమయంలో సత్తుపల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన విజయ లక్ష్మి మెడలో ఉన్న సుమారు 40 గ్రాముల బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారైనట్లు పోలీసులు తెలిపారు.ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం 23న రాత్రి చీకటిగూడెం శివారులో వాహన తనిఖీల్లో నిందితుడిని అదుపులోకి తీసుకుంది. విచారణలో అప్పులు తీర్చేందుకు దొంగతనానికి పాల్పడ్డానని, నర్సాపురంలో పుస్తెలతాడును కరిగించి రెండు బిస్కెట్లుగా మార్చినట్లు ఒప్పుకున్నాడు. మరొక దొంగతనం చేయాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌కు వెళ్తుండగా పట్టుబడ్డాడు. కేసు ఛేదనలో శాలిగౌరారం కొండల్ రెడ్డి,ఎస్ఐ సతీష్ సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. రాత్రి ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచారు. విలేకరుల సమావేశంలో నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి, నకిరేకల్ సిఐ హరి బాబు,కేతేపల్లి ఎస్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.